నటి లావణ్య త్రిపాఠి సందడి

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రముఖ నటి లావణ్య త్రిపాఠి శనివారం సందడి చేసింది. వివేకానందనగర్ డివిజన్‌లోని జాతీయ రహదారి పై ఏర్పాటు చేసిన నారాయణీ సిల్క్ షోరూమ్‌ను నిర్వాహకులతో కలిసి లావణ్య త్రిపాఠి ప్రారంభించారు. అనంతరం అభిమానులతో సెల్ఫీలు దిగి సందడి చేశారు. సంప్రదాయ వస్త్ర ధారణతో మన సంస్కృతి మరింత ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.

– మియాపూర్, ఆగస్టు 10

డ్వాక్రా మహిళా భవనం ఏర్పాటు చేయండి

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు విన్నవించిన మహిళా సంఘాల ప్రతినిధులు

దుండిగల్, ఆగస్టు 10 : మల్లంపేట్‌లో మహిళా(డ్వాక్రా) సంఘం భవనం ఏర్పాటు చేయాలని పలువురు మహిళా సంఘాల ప్రతినిధులు శనివారం ఎమ్మెల్సీ,బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజును ఆయన కార్యాలయం వద్ద కలిసి విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ రాజు సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానన్నారు. కౌన్సిలర్ అనంతస్వామి, బీఆర్ఎస్ 24వ వార్డు అధ్యక్షుడు రమేశ్, మహిళా సంఘాల ప్రతినిధులు పార్వతి, జ్యోతి, వినోద, విజయలక్ష్మి, సంగీత, సంతోష, ప్రేమలత, కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

కేపీహెచ్‌బీ కాలనీ : కేకేరెడ్డి వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లోని బాస్కెట్‌బాల్ కోర్టులో ఉచిత వైద్యశిబిరం కొనసాగుతుందన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

- అధికారులను ఆదేశించిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు
- వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పరిశీలన

కేపీహెచ్‌బీ కాలనీలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, అధికారులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 10 : కేపీహెచ్‌బీ కాలనీ మలేషియన్ టౌన్‌షిప్ పక్కన ఐదెకరాల స్థలంలో చేపట్టిన పార్కు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం కాలనీలోని ఐదెకరాల పార్కులో పెండింగ్ పనులు, రాజీవ్‌గాంధీ సర్కిల్, కాలనీ 4, 7వ ఫేజ్ సమీపంలోని హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ చౌరస్తాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు ఎకరాల స్థలాన్ని కేబీఆర్ పార్కు తరహాలో తీర్చిదిద్దాలని, పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వన్‌సీటీ, మెడోల్యాండ్ రోడ్డులో వర్షపునీరు నిల్వకుండా ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. నెక్సెస్‌మాల్ రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ఫ్లైఓవర్ కింద నిర్మించిన ఇండోర్ క్రీడా ప్రాంగణం పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. కాలనీ 9వ ఫేజ్‌లోని మూడు ఎకరాల స్థలాన్ని పార్కుగా తీర్చిదిద్దాలన్నారు. కాలనీ 4వ ఫేజ్ ఫ్లైఓవర్ కింద రోడ్డు మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు.

గత పదేండ్లలో కేపీహెచ్‌బీ కాలనీలో వేలాది కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, ఈఈ శ్రీనివాస్, డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్, యూబీడీ సమత, జలమండలి మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాజేశ్‌రాయ్, భవాని, కాలనీల ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి ఎంతైనా ఖర్చు చేస్తాం

- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- ఎంపీ ఈటలతో కలిసి భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

కైలాశ్ హిల్స్‌లో భూగర్భడ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, తదితరులు

దుండిగల్,ఆగస్టు 10 : కాలనీల అభివృద్ధికి ఎన్ని కోట్ల నిధులైనా వెచ్చిస్తామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని కైలాశ్ హిల్స్‌లో శనివారం రూ. 29.60 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేండ్ల కాలంలో నియోజకవర్గంలోని అన్ని డివిజన్లు, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీల్లో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి పనులు చేశామని అన్నారు. ఎంపీ ఈటల మాట్లాడుతూ నియోజకవర్గాల అభివృద్ధికి అన్ని పార్టీల ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రతీ కాలనీ, బస్తీలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అంతకుముందు ఎంపీ, ఎమ్మెల్యే కార్పొరేటర్‌తో కలిసి కాలనీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, బీజేపీ జిల్లా ఇన్‌చార్జి కన్వీనర్ డాక్టర్ మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్, బీఆర్ఎస్ డివిజన్‌అధ్యక్షుడు విజయరామ్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ షురూ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గచ్చిబౌలి సాయ్ గోపీచంద్ అకాడమీ వేదికగా శనివారం 10వ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ మొదలైంది. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు చాముండేశ్వరీనాథ్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలని అన్నారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ వంశీధర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు బంగారుబాబు, ప్రశాంత్‌చంద్ర, పీసీఎస్ రావు, పాపయ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన నిజాంపేట్ డిప్యూటీ మేయర్

కేటీఆర్ ఆశీర్వాదం తీసుకుంటున్న నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, చిత్రంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు

దుండిగల్, ఆగస్టు 10 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ తన పుట్టినరోజు సందర్భంగా శనివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఆయన నివాసంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ ధనరాజ్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమంపై చర్చించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు, యువకులు పాల్గొన్నారు.

అంతకుముందు నిజాంపేట్‌లోని డిప్యూటీ మేయర్ నివాసంలో, అభయాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో జరిగిన జన్మదిన వేడుకల్లో మేయర్ కొలన్‌నీలా గోపాల్‌రెడ్డి దంపతులు, నర్సింహారెడ్డి సహా వివిధ పార్టీలకు చెందిన నాయకులు ధన్‌రాజ్‌యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయంలో నూతనంగా నిర్మించిన కల్యాణమండపం, కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు.

ఉచిత వైద్యసేవలు అభినందనీయం : ఎమ్మెల్యే

జగద్గిరిగుట్ట, ఆగస్టు 10 : ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు సేవలందించడం అభినందనీయమని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట శ్రీసాయివిద్యా నికేతన్ హైస్కూల్‌లో శనివారం లయన్స్‌క్లబ్, మల్లారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని కార్పొరేటర్ జగన్‌తో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు. సేవాభావంతో ప్రజలకు చేయూత అందించేందుకు సంస్థలు, దాతలు ముందుకురావాలని సూచించారు. వైద్యులు పరీక్షించిన అనంతరం అవసరమైన వారికి మందులు అందజేశారు. ప్రిన్సిపాల్ శోభారాణి, లయన్స్‌క్లబ్, పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు రామేశ్వర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, వినోద్‌జాదవ్, బాలరాజు, సిద్ధారెడ్డి, మల్లారెడ్డి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ సేవే లక్ష్యం : కొండా విజయ్‌కుమార్

పారిశుధ్య కార్మికులకు చీరలు, దుస్తులు పంపిణీ చేస్తున్న హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్

మాదాపూర్, ఆగస్టు 10: సమాజ సేవే లక్ష్యంగా హోప్ ఫౌండేషన్ ద్వారా తనవంతు సహాయం అందిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ అన్నారు. హోప్ ఫౌండేషన్ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మాదాపూర్ వార్డు కార్యాలయం వద్ద ఆయన పారిశుధ్య కార్మికులకు చీరలు, దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి మాట్లాడారు. పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతో 2016లో హోప్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ ఫౌండేషన్ ద్వారా క్రీడాకారులకు, పేద విద్యార్థులకు, వైద్య సమస్యలున్న పేద వారికి సహాయం చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు చదువు కోసం, పేద మహిళలకు కుట్టు మిషన్లు అందించడంతోపాటు తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులతోపాటు లయన్స్, హోప్ సభ్యులు బసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, బర్క మల్లేశ్‌యాదవ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

మియాపూర్, ఆగస్టు 10 : ఆల్విన్ కాలనీ డివిజన్ శంశీగూడ అనసూయమ్మ మహంకాళీనగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రహదారికి ఇరువైపులా మట్టి వేయాలన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

వీనుల విందుగా సంకీర్తనలు

అన్నమాచార్య భావనా వాహినిలో సంకీర్తనలను ఆలాపిస్తున్న వైష్ణవి

మాదాపూర్, ఆగస్టు 10: కళాకారిణి వైష్ణవి ఆలాపించిన శ్రీ స్వరసిద్ధి వేంకటేశ్వర స్వామి సంకీర్తనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో అన్నమాచార్య భావనా వాహినిలో విద్యార్థులతో కలిసి శనివారం సంకీర్తనల కార్యక్రమం నిర్వహించారు. వైష్ణవి గోపరాజు సంకీర్తనలు ఆలపించగా కీబోర్డు గురుప్రసాద్, మృదంగం రామకృష్ణ వాయిద్య సహకారం అందించారు. శోభరాజు వైష్ణవికి జ్ఞాపికను అందజేసి అభినందించారు.

శిల్పారామంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, ఆగస్టు 10 : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురి కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కళాకారులు కూచిపూడి, భరతనాట్యం, మోహినీయాట్టం నృత్యాలతో అలరించారు. అర్చన గుత్తి తన శిష్య బృందంతో కలిసి బ్రహ్మాంజలి, అదివో అల్లదిగో, శివ పంచాక్షరీ కృష్ణ జనన శబ్దం, గోవర్ధన గిరిధరి, ధనశ్రీ తిల్లాన, స్వాగతం కృష్ణ అంశాలను కూచిపూడి నృత్యరీతులలో ప్రదర్శించి ఆకట్టుకోగా, ధనీషా ధనపాల్ మోహినీయాట్టం, ఆషిక షణ్ముగం భరతనాట్య నృత్యరీతులతో ఆకట్టుకున్నారు. ప్రముఖ నాట్య గురువు నిర్మల ప్రభాకర్, వీఆర్ కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ వెంకట్‌రెడ్డి హాజరై కళాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

కుత్బుల్లాపూర్, ఆగస్టు 10 : గుట్టుచప్పుడు కాకుండా గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని శనివారం కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీసులు నిఘా పెట్టి పట్టుకున్నారు. సుభాష్‌నగర్‌లోని గంపలబస్తీలో గంజాయితో కూడిన చాక్లెట్లను విక్రయిస్తున్న బీహార్‌కు చెందిన అభయ్‌గిరి అక్కడి నుంచి దిగుమతి చేసుకొని గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నాడు. నిందితుడిని పట్టుకుని అతడి వద్ద 4.47 కేజీల ఎండు గంజాయి, 0.75 కేజీల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించిన్నట్లు ఎక్సైజ్ సీఐ యాదయ్య తెలిపారు.

కాలనీలను ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

కాలనీల్లో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మాదాపూర్, ఆగస్టు 10: అందరి సహకారంతో కాలనీలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. మాదాపూర్ డివిజన్‌లోని కాలనీల్లో నెలకొన్న సమస్యలతో పాటు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై శనివారం స్థానిక కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. అవసరమైన చోట రోడ్లు విస్తరించాలని, ఫుట్‌పాత్‌లను నిర్మించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సీనియర్ సిటీజన్స్ పార్క్‌లో సేదతీరేందుకు వీలుగా సమావేశ మందిరం నిర్మించాలన్నారు. సైబర్ విలేజ్ నుంచి వచ్చే డ్రైనేజీని శిల్పా పార్క్ పైప్‌లైన్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. సైబర్ విలేజ్, కృష్ణ కాలనీలో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. కాగా కుక్కల బారి నుంచి తమను రక్షించాలని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా స్పందించిన ఆయన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలనీల్లో పెండింగ్‌పనులను త్వరలోనే పూర్తి చేస్తానన్నారు. ఈఈ కాలనీలో సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ ట్రాఫిక్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, సాంబశివరావు, కృష్ణ, అంకారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం.. సీఎం సహాయ నిధి

మియాపూర్ : నిరుపేదల ఆరోగ్యానికి సీఎం సహాయ నిధి భరోసా ఇస్తున్నదని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 45 మందికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 18.42 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే గాంధీ శనివారం తన నివాసంలో బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేదలకు ఆపదలో ఆపన్న హస్తం అందిస్తున్నదని అన్నారు. కార్పొరేట్‌లో వైద్య సేవలను పొందుతున్నారన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్‌యాదవ్, శ్రీధర్ రెడ్డి, రామచంద్రరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నరేందర్, దేవేందర్, బాల్‌నర్సయ్య, మోహన్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, సురేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి : కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ ప్రతినిధులు

దుండిగల్, ఆగస్టు 10: కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నేత, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, కాలనీల సంక్షేమసంఘాల సభ్యులు,బీఆర్ఎస్ కార్యకర్తలు శనివారం కౌన్సిలర్ కృష్ణను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కృష్ణ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేసి నూతన పనులను త్వరలోనే చేపడతామని హామీ ఇచ్చారు.

అనంతరం మల్లంపేట్‌కు చెందిన ఏపీఆర్ ప్రాజెక్ట్స్ నూతన సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు శంభీపూర్ కృష్ణను కలిసి తమ కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

హిందువులపై దాడులను నిరసిస్తూ ర్యాలీ

నిరసన ర్యాలీలో పాల్గొన్న హిందూ సంఘాల ప్రతినిధులు

బాలానగర్, ఆగస్టు 10 : బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు చేయడం దేవాలయాలను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ బాలానగర్‌లో శనివారం పలు హిందూ సంఘాలు ర్యాలీ నిర్వహించారు. భారతీయ నమో మోదీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీకి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ హాజరయ్యారు. ఫిరోజ్‌గూడ నుంచి బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా వరకు హిందువులు ప్లెక్సీలు పట్టుకొని బంగ్లాదేశ్ దుశ్చర్యకు నిరసనగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో ఉన్న హిందువులను కాపాడాలని ఎద్ద ఎత్తున నినాదాలు చేశారు. బంగ్లాదేశ్ దుశ్చర్యలను ప్రపంచ దేశాలు ఖండించి తగిన గుణ పాఠం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హిందు వాహిని నేత శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ బీజేపీ నేత డి. శంకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, చెన్నయ్య ముదిరాజ్, వెంకటేశ్‌ముదిరాజ్, సుదర్శన్ ముదిరాజ్, శ్రీశైలం, సురేశ్, రూప, తదితరులు పాల్గొన్నారు.

'ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపండి'

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జేఎన్‌టీయూ రోడ్ అడ్డగుట్ట సమతా నగర్ మీదుగా ప్రగతినగర్ దారిలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని సీఐ వెంకట్‌కు కార్పొరేటర్ శ్రీనివాస్ రావు విన్నవించారు. శనివారం ఆ దారిలో ట్రాఫిక్ సమస్యను వారు పరిశీలించారు. ఎంఎన్ఆర్ కళాశాల వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటున్నదని శాశ్వత పరిష్కారం చూపాలని కార్పొరేటర్ సీఐని కోరారు. రహదారులపై ఆక్రమణలను తొలగించాలని, పైప్‌లైన్ పనులకు సంబంధించి జల మండలి జాప్యం లేకుండా చూడాలని సూచించారు. – మియాపూర్

తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి

అల్వాల్ చౌరస్తాలో తెలంగాణ ఉద్యమకారుల చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉప్పల్, ఆగస్టు 10 : తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులకు న్యాయం చేసేవిధంగా చూడాలని ఉద్యమకారులు నెర్ధం భాస్కర్‌గౌడ్, డాక్టర్ చీమ శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఉప్పల్ రింగ్‌రోడ్డులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఉద్యమకారుల సంక్షేమబోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 27న తెలంగాణ ఆత్మీయ సమ్మేళనం హరిహర కళాభవన్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

మల్కాజిగిరి: తెలంగాణ ఉద్యమకారుల చైతన్య యాత్రను విజయవంతం చేయాలని టీజేఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు మారం లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ ఉద్యమకారుల చైతన్య యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించి చైతన్య యాత్రకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి దొమ్మటి కిరణ్ కుమార్, కోఆర్డినేటర్ రాంబాబు, ఉప్పల్ అధ్యక్షుడు గగన్‌కుమార్, శ్రీనివాస్, జానకి రెడ్డి, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

13న ఎమ్మార్పీఎస్ ర్యాలీని జయప్రదం చేయండి

విజయోత్సవ దండోరా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్,ఆగస్టు 10 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ ఈ నెల 13న నగరంలో నిర్వహించే విజయోత్సవ దండోరాను జయప్రదం చేయాలని పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం మైదానం ఎమ్మార్పీఎస్, మాదిగ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో విజయోత్సవ దండోరా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ 13న నగరానికి వస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు ఘనస్వాగతం పలికేందుకు మాదిగలు, మాదిగ ఉపకులాల కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు చిన్న వెంకటేశ్, సిలువేరు శ్రీనివాస్, యాదగిరి, రవి, మాదిగ జర్నలిస్టు ఫోరం జాతీయ నాయకులు రామస్వామి, యాకన్న, తిరుపతి,క్రిష్ణ, అబ్రహం, సలోమి, పద్మ, అరుణ, శ్రావణి, కళ్యాణ్ పాల్గొన్నారు.

మాదిగలు వేలాదిగా తరలండి..

కేపీహెచ్‌బీకాలనీ : 13న నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ ర్యాలీని జయప్రదం చేయాలని కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కూచిపూడి సత్యం పిలుపునిచ్చారు. శనివారం కూకట్‌పల్లిలో ముత్యపాగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జి కూచిపూడి సత్యం మాదిగ, కో ఇన్‌చార్జీ సూదిపాక వాసుదేవరావు మాదిగ, చిరంజీవి మాదిగ హాజరై మాట్లాడారు. ర్యాలీలో మాదిగలు, మాదిగ ఉపకులాల ప్రజలు లక్షలాదిగా తరలి రావాలని కోరారు. రాజుమాదిగ, అభిలాష్, చింటు, చంద్రకళ, సాయమ్మ, గణేశ్, అనిల్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పురస్కారాలు

మల్లాపూర్, ఆగస్టు 10 : శ్రీ లక్ష్మీ ప్రసన్న చారిటబుల్ ట్రస్ట్ ఎస్ఎల్‌పీ, ఎస్‌జేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని త్యాగరాయగాన సభలో కళాకార్, సేవారత్న పురస్కారాలను శనివారం అందజేశారు. పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్షుడు కురుమన్న ఆధ్వర్యంలో 25 మంది పారిశుధ్య కార్మికులకు రాష్ట్ర వ్యవస్థాపక చైర్మన్ శ్రీధర్‌గుప్త, లక్ష్మీప్రసన్న, వెంకట్‌గౌడ్, ఏపూరి సోమన్న చేతుల మీదుగా పురస్కారాలను అందజేశారు.

పోలీస్ వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

కొండాపూర్, ఆగస్టు 10 : మదీనాగూడలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాల చిన్